క్లుప్తంగా

ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం



పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం స్వామి వారి బొమ్మలకు పెయింటింగ్, మండపంలో గ్రానైట్ రాయి, టాయిలెట్స్ నిర్మాణాలను నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ప్రారంభించారు. అనంతరం స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసరావు, చైర్మన్ పి. జయ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్‌ని సత్కరించి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, శ్రీనివాసులు, అర్చకులు నరసింహాచార్యులు, మురళి, సిబ్బంది, పాల్గొన్నారు.

19న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు మధువని సుస్వరాల పల్లకీ సంస్థ ఆధ్వర్యంలో సుస్వర గీత మాలిక పేరుతో సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు మధుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గాయనీ, గాయకులు పాటల్ని ఆలపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

భవిష్యనిధి పింఛనుదారుల సమస్యలపై చర్చ

గుంటూరు ఎడ్యుకేషన్: బెంగళూరులో శుక్రవారం జరిగిన అఖిల భారత భవిష్యనిధి (ఈపీఎఫ్ఓ) పింఛనుదారుల సమాఖ్య వార్షిక సమావేశంలో భాగంగా సమస్యలు, సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆంధ్రప్రదేశ్ భవిష్యనిధి పెన్షనర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాజీ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్ఓ విశ్రాంత పింఛనుదారుల సంక్షేమ సంఘ జాతీయ సెక్రటరీ జనరల్ బి. రాల నేతృత్వంలో నగదు రహిత వైద్య సేవలు, వార్షిక మెడికల్ చెకప్, కారుణ్య నియామకాలతో పాటు వివిధ అంశాలపై చర్చించి, తీర్మానాలను ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా గోద్రెజ్ గ్రాసియా విజయోత్సవం



పాత గుంటూరు: మంగళదాస్ నగర్‌లోని కల్యాణ మండపంలో గోద్రెజ్ ఆగ్రోనెట్ వారి గ్రాసియా పురుగు మందు విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆగ్రోనెట్ సీఈవో రాజువెల్ పాల్గొని, గోద్రెజ్ కంపెనీ విశిష్టతను వివరించారు. పంటపై తామర, గొంగళి పురుగు ప్రభావితమైన దశలో గ్రాసియా పిచికారీ చేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. నేషనల్ సేల్స్ మేనేజర్ జాయ్ తిలక్ మాట్లాడుతూ కాయగూరలపై క్రిమి కీటకాల్ని గ్రాసియా నివారిస్తుందని చెప్పారు. గోద్రెజ్ కంపెనీ ఎన్నో సంవత్సరాలుగా రైతుల అభిమానం పొందుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సౌత్ సేల్స్ హెడ్ కిరణ్, నాగేశ్వరరావు, డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు బెస్ట్ ఐఈటీఈ అవార్డు



అవార్డు చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నాణ్యత ప్రమాణాలతో విద్యా విధానాలు, విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషి ఫలితంగానే తమ కళాశాల ఎన్నో అవార్డుల్ని గెలుచుకుంటోందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2022 వార్షిక సంవత్సరానికి గానూ ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజినీర్స్ విజయవాడ చాప్టర్ నుంచి తమ కళాశాలలోని ఐఈటీఈ విభాగానికి బెస్ట్ ఐఈటీఈ స్టూడెంట్ చాప్టర్ అవార్డు లభించిందని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు తమ కళాశాల విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలకు నిదర్శనమని చెప్పారు. కళాశాల ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో చదువుతున్న ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ విద్యార్థులు 450 మంది ఐఈటీ స్టూడెంట్ చాప్టర్‌లో రిజిస్టర్ అయ్యారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, స్టూడెంట్ చాప్టర్ కో–ఆర్డినేటర్ పి. శివప్రసాద్ పాల్గొన్నారు.

రూ. 1377.53 కోట్ల అంచనాలతో బడ్జెట్‌కు ఆమోదం

మేయర్ కావటి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ గ్రీన్‌సిగ్నల్



బడ్జెట్ అంశాలపై స్టాండింగ్ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ 2023–24 సంవత్సరానికి గానూ రూ.1377.53 కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను శుక్రవారం నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి నగరపాలక సంస్థ విభాగాధిపతులు, ఆడిట్ అధికారులతో 2022–23 ఆర్థిక సంవత్సరానికి రివైజ్డ్ బడ్జెట్, 2023–24కు సంబంధించిన అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌పై మేయర్ చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2022–23 సంవత్సర అంత్య నిల్వ రూ. 608.93 కోట్లు, రివైజ్డ్ అంచనాలతో 2023–24 సంవత్సరానికి ప్రారంభ నిల్వగా ఉంటుందని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ.768.59 కోట్లు, ఖర్చులు రూ.976.25 కోట్లు అని వివరించారు. ప్రారంభ నిల్వ, ఆదాయం కలుపుకొని రూ.1377.53 కోట్లతో నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీలో ఆమోదించినట్లు వివరించారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కోసం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్ ఫర్జానా, నిమ్మల వెంకటరమణ, పడాల సుబ్బారెడ్డి, బొడ్డుపల్లి స్మిత పద్మజ, షేక్ జుమ్మాబి, మల్లవరపు రమ్య పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు నూరు శాతం చేపట్టాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీ రద్దు చేసిన నేపథ్యంలో అధికారులంతా నూరు శాతం పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి శుక్రవారం ఆయన పన్ను వసూళ్లు, వడ్డీ రాయితీ తదితర అంశాలపై డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి, ఖాళీ స్థల పన్నులపై వడ్డీ రాయితీ ఇచ్చిందని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్ను రాయితీ అంశాన్ని సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ తెలియజేయాలని సూచించారు. ఈ నెల 31లోపు పన్ను చెల్లించిన వారికి వడ్డీ రాయితీ లభిస్తుందని, ఆ తర్వాత వడ్డీ జమ అవుతుందని పేర్కొన్నారు. సచివాలయాల అడ్మిన్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని, పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆర్‌ఐలకు సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ వడ్డీ రాయితీ దీర్ఘకాలంగా పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న వారికి సువర్ణ అవకాశమని తెలిపారు. నగరంలో భవన నిర్మాణదారులు కూడా నిర్మాణానికి ముందే ఖాళీ స్థల పన్ను చెల్లించాలని, అప్పుడే మార్ట్‌గేజ్, ఎన్‌ఓసీలు మంజూరు వేగంగా అవుతాయని చెప్పారు. లైసెన్స్ టెక్నికల్ ఇంజినీర్లతో ఖాళీ స్థల పన్ను చెల్లింపుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. పన్ను చెల్లింపుదార్లకు అనుగుణంగా అదనపు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ మూర్తి, రెవెన్యూ అధికారులు ప్రసాద్, బాలాజీ బాష, రవికుమార్, పోలేశ్వరరావు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

23న ప్రముఖులకు ఉగాది పురస్కారాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు, వీరాంజనేయులు, గోపీకుమార్ తదితరులు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 23న ఉగాది పురస్కరించుకుని పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారిణులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులైన అడిషనల్ ఎస్పీ కె. సుప్రజ, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి. విజయ, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సీహెచ్. అమూల్య, బీసీ కార్పొరేషన్ ఈడీ డి. దుర్గాబాయి, సివిల్ సప్లయిస్ జీఎం జి.లక్ష్మి, సీఐడీ ఎస్పీ కె.జి.వి. సరిత, అన్నదాన సమాజం ఈవో డి. ప్రమీలారాణి, కాకి భాగ్యలక్ష్మి, మేకల శేషుకుమారికి పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో నిర్వాహకులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మిరియాల గోపీకుమార్, మేకల రవీంద్రబాబు పాల్గొన్నారు.

3వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పట్నంబజారు: మూడో డివిజన్ లక్ష్మీనగర్‌లో సైడు కాలువల నిర్మాణానికి శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ శివారు ప్రాంతమైన లక్ష్మీనగర్‌లో సైడు కాల్వలు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో రూ. 40 లక్షలతో వాటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలవరపు వెంకటేశ్వరరావు, మాదాసు మాధవ, రాచమంటి భాస్కర్, స్వర్ణలత, రఘు, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

గురువు ప్రోత్సాహంతోనే లక్ష్య సాధన



పరిశోధన పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, వీసీ రాజశేఖర్

కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి

ఏఎన్‌యూ: ఎమ్మెస్సీ మాథమాటిక్స్ చదివే రోజుల్లో గురువు శ్రీనాథ్ ప్రోత్సాహం తనను లక్ష్య సాధనవైపు నడిపిందని కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ మాథమాటికల్ సైన్సెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అంశంపై రెండు రోజులపాటు జరుగుతున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రసంగిస్తూ.. తాను ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు సివిల్ సర్వీసెస్ వైపు వెళ్లమని గురువు శ్రీనాథ్ ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. గణితం చదవడం వల్ల ప్రతి రోజు జిల్లా పరిపాలనలో ఎదురయ్యే ఎన్నో సమస్యల్ని విభిన్నంగా పరిష్కరించగలుగుతున్నానని చెప్పారు. గణితం మూలంగా తార్కికంగా, విశ్లేషణాత్మకంగా ఏ సమస్య మూలాన్నైనా అవగాహన చేసుకొని, పరిష్కరించవచ్చని వివరించారు. గణితం అనేది ప్రకృతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగించే పరికరం, పనుముట్టు, భాష అని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న తన గురువు శ్రీనాథ్‌కు కలెక్టర్ వినయంగా నమస్కరించి గురుభక్తి చాటుకున్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ స్వీయ క్రమ శిక్షణకు గణితం దోహదం చేస్తుందని తెలిపారు. తన గురువు శ్రీనాథ్ ముందు కలెక్టర్ చేతులు కట్టుకొని ఉండటాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అలహాబాద్ ప్రొఫెసర్ పంకజ్ శ్రీవాస్తవ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. గంగాధరరావు, రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, సైన్స్ సొసైటీ ఆఫ్ ఏపీ సీఈఓ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, ఏపీటీఎస్ఎంఏ జనరల్ సెక్రటరీ సి. జయసుబ్బారెడ్డి, గణితశాస్త్ర విభాగాధిపతి ఆర్. శ్రీనివాసరావు, సదస్సు డైరెక్టర్ బి. సత్యనారాయణ ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ, కలెక్టర్ ఆవిష్కరించారు.

ఉన్నత లక్ష్యంతో కృషే ప్రగతికి సోపానం



సమావేశంలో మాట్లాడుతున్న శివమకుటమ్

గుంటూరు రూరల్: ఉన్నత లక్ష్యాలతో కూడిన కృషే ప్రగతికి సోపానమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొటెక్షన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బీఈఎంఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ శివమకుటమ్ తెలిపారు. నగర శివారు లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సోవమ్ 2023 యువజనోత్సవాల్లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత శిఖరాల్ని అధిరోహించేందుకు విద్య ఒక్కటే సాధనం కాదన్నారు. ఆత్మవిశ్వాసంతో పాటు జీవితం, సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాల్ని మెరుగు పరుచుకోవాలని తెలిపారు. దేశాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై. సుజిత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సరైన నిర్ణయాలు తీసుకోవాలని, వీటిపైనే భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుందని సూచించారు. కళాశాల సాధించిన విజయాలు, నాక్ ఏ గ్రేడ్, ఎన్‌బీఏ, పరిశోధనల గురించి ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో విద్యార్థులకు వివిధ పోటీల్ని నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె. వెంకటరామారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



బ్రిడ్జి వంతెనపై ఇరుక్కుపోయిన లారీ (ఇన్‌సెట్) లక్ష్మీనారాయణ మృతదేహం

చేబ్రోలు: గ్రావెల్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన నిమిశెట్టి లక్ష్మీనారాయణ(21) ఇంటర్ వరకు చదివి వడ్లమూడిలోని సంగం డెయిరీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం డ్యూటీకి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. స్నేహితుడు ఫోన్ చేయటంతో ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. మార్గంమధ్యలో గరువుపాలెం సంగం జాగర్లమూడి లాకుల వద్ద వెనుక నుంచి వచ్చిన గ్రావెల్ లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో లక్ష్మీనారాయణ అక్కడక్కడే మరణించాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను ఢీ కొట్టిన లారీ దూసుకు వెళ్లి వంతెన అంచున నిలిచిపోయింది. ముందు చక్రాలు గాలిలో ఉన్నాయి. మరికొద్దిగా వెళ్లి ఉంటే డ్రెయిన్‌లో బోల్తా పడేది. చేబ్రోలు ఎస్‌ఐ కె. ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.

ఆహార నాణ్యతపై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆహార ప్రమాణాలు, నాణ్యత గురించి తెలుసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం హోం సైన్స్ శాస్త్రవేత్త ఎం.దీప తెలిపారు. రెండు రోజులుగా నగర శివారులోని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రంలో ఆహార ప్రమాణాలు, నాణ్యతపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం కొనసాగింది. కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కల్తీలను గుర్తించే విధానాల్ని శాస్త్రవేత్త దీప వివరించారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): మానసిక వేదనతో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన దోర్నల్ల సుధాకరరావు (42) ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాడు. శివభక్తుడైన అతడు వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిగా జీవనం సాగిస్తున్నాడు. కొద్ది నెలల కిందట తల్లి మరణించడంతో మానసికంగా కృంగి పోయాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి మంచినీటి చెరువు పక్కనున్న వెంకయ్య బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ డి. రవీంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీవితం మీద వైరాగ్యంతోనే కొడుకు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఓబారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీలకతీతంగా నగర అభివృద్ధి: మేయర్



కేకును కట్ చేస్తున్న మేయర్, కార్పొరేటర్లు

నెహ్రూనగర్: రెండు సంవత్సరాల పాలనలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి పాలకవర్గం విశేష కృషి చేసిందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర నాయుడు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడి శుక్రవారం నాటికి రెండేళ్లు గడిచిన సందర్భంగా మేయర్‌ను చాంబర్‌లో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు కలసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం తరువాత గుంటూరు నగరానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వ స్ఫూర్తితో పాలకవర్గం ఏర్పడిందని చెప్పారు. రెండేళ్లలో నగరంలో ప్రతి వార్డులో అనేక అభివృద్ధి పనుల్ని పాలకవర్గం చేపట్టిందని తెలిపారు. పార్టీలకతీతంగా, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులతో కలసి పాలకవర్గం కృషి చేస్తోందని వివరించారు. సీసీ డ్రెయిన్లు, రోడ్లు, స్థానిక పార్కులు, రోడ్ల విస్తరణ పనుల్ని అత్యంత వేగంగా చేపట్టామని పేర్కొన్నారు. రానున్న కాలంలో నగరాన్ని రాష్ట్రంలో అభివృద్ధికి మోడల్‌గా తీర్చిదిద్దడానికి అధికారులు, పాలకవర్గం కృతనిశ్చయంతో ముందుకు వెళుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై వర్షం నీటిని తోడించిన అధికార యంత్రాంగం

- ఇంటర్ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు
- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షం కారణంగా ఇంటర్ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురు కాకుండా అధికార యంత్రాంగం చురుగ్గా స్పందించింది. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో పలు రూట్లలో ఉన్న పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పలువురు తల్లిదండ్రులు ఫోన్ ద్వారా ఇంటర్ బోర్డు ఆర్ఐవో జి. సునీత దృష్టికి తీసుకెళ్లారు. ఏసీ కళాశాల నుంచి మహిళా కళాశాలకు వెళ్లే మార్గంతో పాటు పెదపలకలూరు రోడ్డులో పెద్దఎత్తున నీరు నిలిచిపోయిన విషయమై ఆమె తక్షణమే జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఆయా రూట్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో మాట్లాడారు. రోడ్లపై నిలిచిన నీటిని తోడించాలని నగర కమిషనర్ చేకూరి కీర్తికి సూచించడంతో ఆమె వెంటనే ఇంజినీరింగ్, శానిటరీ విభాగాలను అప్రమత్తం చేసి వాహనాలను అక్కడి పంపించారు. అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సమన్వయంతో తీసుకున్న చర్యలతో వర్షం ప్రభావం పడకుండా విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటల కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

రవాణా శాఖ ఉద్యోగిపై దాడిని ఖండిస్తూ నిరసన



కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న డీటీసీ కరీం, సిబ్బంది

పట్నంబజారు: కాకినాడలో వాహన తనిఖీ అధికారిపై భౌతికదాడికి నిరసనగా శుక్రవారం జిల్లా రవాణా శాఖ సిబ్బంది నిరసన తెలియజేశారు. స్వర్ణభారతీనగర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ విధుల్లో ఉన్న అసిస్టెంట్ మోటారు వాహన తనిఖీ అధికారి చిన్నారావుపై కొబ్బరి బొండాల వ్యాపారి కత్తితో దాడి చేయడం దారుణమని ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద' విద్యార్థులకు పుష్టికరం

ఉర్దూ డీఐ ఖాసీం



విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్ద రూపంలో ప్రభుత్వం అందజేస్తున్న బలవర్ధకమైన పౌష్టికాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు పాఠశాలలోనే తినాలని ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం సూచించారు. ప్రకాష్‌నగర్‌లోని నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల నోట్, వర్క్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తప్పనిసరిగా ఉర్దూ మాధ్యమంలో బోధించాలని, వర్క్‌బుక్స్ పరిశీలించిన తరువాత ప్రతి పేజీలో ఉపాధ్యాయుల సంతకం ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులంతా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేసే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు హుస్సేన్ షరీఫ్, తాహెరున్నీసా ఉన్నారు.

నేడు అమ్మ శత జయంతి సందేశ సభ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న హైమానంద్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై జిల్లెళ్లమూడి శ్రీ విశ్వజననీ పరిషత్ ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మ శత జయంతి ఉత్సవాల్ని పురస్కరించుకుని శనివారం సందేశ సభ నిర్వహిస్తున్నట్లు మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. శ్రీమన్నారాయణమూర్తి మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు నాట్యాచార్యులు యస్.కె. ఖలీల్ బృందం నత్యంతో ప్రారంభమవుతుందని తెలిపారు. సందేశ సభలో పండితులు, ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మ పరిరక్షణ సమితి దర్శనపు శ్రీనివాస్, జిల్లెళ్లమూడి కమిటీ సభ్యులు జె. సుబ్రహ్మణ్యం, పి. హైమానంద్, యు. విజయేంద్ర పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో ప్రజారోగ్యం, పర్యావరణానికి విఘాతం



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య

నెహ్రూనగర్: ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను విఘాతం కలిగించే ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని డెప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య సూచించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ విక్రయదారులతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం జిన్నా టవర్ వద్ద ఉన్న కుసుమ హరనాథ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయాల నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రోజురోజుకీ ప్లాస్టిక్ వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాన్ని గుర్తించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధంపై మార్గదర్శకాలు విడుదల చేశాయని తెలిపారు. మంచి స్వచ్ఛ ర్యాంకింగ్ సాధించాలంటే తప్పనిసరిగా సిటీలో ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు జరగాలని తెలియచేశారు. ప్లాస్టిక్ ప్రమాదాన్ని గుర్తించి అనేక ప్రధాన దేవాలయాలు, షాపింగ్ మాల్స్‌లో ప్రత్యామ్నాయంగా క్లాత్, జూట్, పేపర్ సంచులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రానున్న కాలంలో గుంటూరును ప్లాస్టిక్ రహితంగా, క్లీన్ గుంటూరు సాధనలో వ్యాపారస్తులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రజల్లో అవగాహన కోసం ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్, శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, ఆనందకుమార్, అయూబ్ ఖాన్, సోమశేఖర్ పాల్గొన్నారు.